క్లుప్తంగా

సీఎం జగన్ మళ్లీ అధికారం చేపట్టాలి



శ్రీధర్‌రెడ్డికి స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్, ఈఓలు

ఆత్రేయపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు (స్కిల్ ట్రైనింగ్ జాబ్ ఫెయిర్) గాది శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు గాదె శ్రీధర్‌రెడ్డి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని స్వామి వారి చరిత్ర గురించి తెలుసుకున్నారు. ఆయనకు చైర్మన్, ఈవోలు స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. రాష్ట్రంలో నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు సీఎం జగన్ ప్రతి నియోజకవర్గంలో స్కిల్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అదే విధంగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం



అమలాపురంలో రక్తదానం చేస్తున్న యువకులు, యోగా గురువు శ్రీనివాస్

అంబాజీపేట: ప్రాణాపాయంలో ఉన్నవారికి తొమ్మిది మంది యువకులు రక్తదానం చేసి ప్రాణం పోశారు. ఇందుకు సంబంధించి స్వామి వివేకానంద యోగా ఆశ్రమం ఆయుర్వేదం ఫిజియోథెరపీ ఆసుపత్రి, యోగా గురువు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం అమలాపురం ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పల్లంకుర్రు, వాకలగరువు, పుల్లేటికుర్రులకు చెందిన గర్భిణులు చింతపల్లి సుజాత, చిట్టూరి లక్ష్మి, మట్టా ధనలక్ష్మిలకు అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈదరపల్లికి చెందిన మరో గర్భిణి ఎల్.పార్వతికి రక్తం అవసరం కాగా యోగాశ్రమ యువకులు రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడారు. ప్లేట్‌లెట్స్ పడిపోయి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొమరగిరిపట్నం చెందిన మద్దింశెట్టి కనకయ్యకు రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు.రక్తదానం చేసిన వారిలో కె.దుర్గ, పి.అనిల్, సి.మల్లికార్జున్, ఎం.సుధీర్, ఎల్.ప్రశాంత్, ఎ.మనోహర్, కె.శ్రీనివాస్, డి.ప్రభాకర్, సీహెచ్ మహేంద్ర ఉన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీటీసీ మృతి



కొంబత్తుల నాగేశ్వరరావు (ఫైల్)

మామిడికుదురు: ఆదుర్రు ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొంబత్తుల నాగేశ్వరరావు (78) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నాగేశ్వరరావు ఆదుర్రు శివారు మోరిపాలంలోని తన స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు భార్య సుభాషిణి, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన అంత్యక్రియలను ఆదివారం మోరిపాలంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంపీటీసీ సభ్యుడిగా అయిదేళ్ల పాటు గ్రామాభివృద్ధికి ఆయన ఎంతో సేవా చేశారని స్థానికులు పేర్కొన్నారు. నాగేశ్వరరావు మృతికి ఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, స్థానిక ఎంపీటీసీ గెడ్డం మహాలక్ష్మమ్మ, సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు సంతాపం తెలిపారు.

నిందితుల కోసం గాలింపు చర్యలు

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో పలమర్తి వీర అంజికుమార్‌పై హత్యాయత్నానికి పాల్పడిన నలుగురు నిందితులను ఆరెస్ట్ చేసేందుకు ఆలమూరు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి స్థానికుల నుంచి వివరాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఆ రెండు గ్రూపుల మధ్య పాత కక్షలు ఉన్నాయనే నేపథ్యంలో దర్యాప్తును వేగవంతం చేశారు. బ్లేళ్లతో విచక్షణరహితంగా దాడి జరిపి హతమార్చేందుకు ప్రయత్నించిన నిందితులందరినీ త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని ఎస్సై ఎస్.శివప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు.

అభివృద్ధి, సంక్షేమంపై ఇంటింటి ప్రచారం

మలికిపురం: బీజేపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల ప్రకారం ఈ నెల 30 నుంచి వచ్చే నెల 30వ తేదీ వరకూ కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను కరపత్రాల రూపంలో ఇంటింటికీ ప్రచారం చేసే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ డైరెక్టర్ మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. శనివారం శంకరగుప్తంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమరగిరి శ్రీనివాసరావు ఇంటి వద్ద ముత్యాల తాతంబాబు అధ్యక్షతన మండల పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అడబాల సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువైన పాలన

- సచివాలయాలతో ఎంతో సౌలభ్యం
- ప్రజలకు అందుబాటులో 536 సేవలు
- నిమిషాల్లో సమస్యల పరిష్కారం

మామిడికుదురు: ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని 2020 అక్టోబరు 2 గాంధీ జయంతి నుంచి ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారు. ఈ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా తనదైన శైలితో వైఎస్సార్ సీపీ సర్కారు ప్రజలకు విశేషమైన సేవలందిస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను సమన్వయం చేస్తూ సమస్త సేవలను సచివాలయాల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చింది. రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం, 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్నారు. సచివాలయాల ద్వారా 536 రకాల సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సేవలను 15 నిమిషాల నుంచి 72 గంటల్లో పొందే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మారుమూల ప్రాంతాల్లో సైతం సచివాలయ సేవలను పొందే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. వీటికి అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది.

మూడు నియోజకవర్గాలు..
237 సచివాలయాలు..

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో 237 సచివాలయాలు ఉన్నాయి. పి.గన్నవరం నియోజకవర్గంలో 76 సచివాలయాలు, కొత్తపేట నియోజకవర్గంలో 87 సచివాలయాలు, రాజోలు నియోజకవర్గంలో 74 సచివాలయాలు ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి సేవకు మండల కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. రెండు మూడ్రోజులు తిరిగితే కానీ పని పూర్తయ్యేది కాదు. ఇప్పుడు ఆ పరిస్థితికి రాష్ట్ర సర్కారు పూర్తిగా చరమగీతం పాడింది. ప్రజల వద్దకే సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చింది. సచివాలయ వ్యవస్థపై ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా ప్రతి ఒక్కరికి అవసరమైన ఆదాయ, కుల, ధ్రువపత్రాలతో పాటు రేషన్ కార్డులు, పింఛన్‌లు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, తదితర సేవలు అందుబాటులోకి వచ్చాయి.



మామిడికుదురు గ్రామ సచివాలయం

గంటల వ్యవధిలో సర్టిఫికెట్లు



గ్రామ సచివాలయాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఏ సర్టిఫికెట్ కావాలన్నా గంటల వ్యవధిలో ఇస్తున్నారు. నేను కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నా. అదే రోజు నాకు సర్టిఫికెట్ ఇచ్చారు. గతంలో ఇలా ఉండేది కాదు. మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బంది లేదు. నేరుగా మా గ్రామంలోనే అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి.

– గెద్దం బాలరాజు, కొమరాడ

అందుబాటులో సేవలు



సచివాలయాల్లో ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చారు. రేషన్‌కార్డు కోసం గతంలో పదే పదే మండల కార్యాలయానికి తిరిగే వాళ్లం. సచివాలయం వచ్చిన తరువాత రేషన్ కార్డు నిమిషాల్లో ఇస్తున్నారు. ప్రజలకు అవసరమైన పథకాల కోసం గ్రామంలో ఉన్న సచివాలయాల్లోనే నమోదు చేసున్నారు.

– గోనిపాటి రాజేంద్ర, మొగలికుదురు

జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి

అంబాజీపేట: ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటినీ నెరవేరుస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండి మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కోరారు. గంగలకుర్రులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అమ్మఒడి, రైతు భరోసా, జగనన్న చేయూత, జగనన్న తోడు, ఆసరా, సున్నావడ్డీ వంటి సంక్షేమ పథకాల్ని పార్టీలు, వర్గాలు, గ్రూపులకు అతీతంగా అందించారన్నారు. ప్రజా సమస్యల్ని ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ప్రభుత్వం గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకు వచ్చారన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాల ద్వారా కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. అంతకుముందు కాలనీల్లో డ్రైనేజీలు, రహదారులు నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యే చిట్టిబాబును కోరారు. వీటిని త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ నెల్లి పండు, సొసైటీ అధ్యక్షులు మట్టపర్తి చంద్రశేఖర్, దొమ్మేటి సత్యమోహన్, నాగవరపు నాగరాజు, దొమ్మేటి నాగన్న, ముత్తాబత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



గంగలకుర్రులో బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పాస్టర్‌కు రూ.50 వేల అందజేత



పాస్టర్‌కు విరాళం అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: ఏసుక్రీస్తు సందేశం ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అంకంపాలెం సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ పేరిష్‌కు రూ.50 వేల విరాళం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, కప్పల శ్రీధర్, కర్రి నాగిరెడ్డి, గారపాటి గంగారామ్ చౌదరిలను పాస్టర్ పేరిష్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

అమలాపురం రూరల్: స్థానిక కలెక్టర్ చాంబర్‌లో పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సమక్షంలో ఇద్దరికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా సీఎం సహాయనిధి చెక్కులను శనివారం అందచేశారు. అయినవిల్లి గ్రామ పంచాయతీకి చెందిన వలంటీర్ జనిపెల్ల దుర్గాప్రసాద్, అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామ వలంటీర్ కత్తుల శ్రీకృష్ణలు మృతి చెందడంతో వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు చేశారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా జనిపెల్ల దుర్గాప్రసాద్ భార్య జనిపెల్ల శ్రావణ సంధ్య, కత్తుల శ్రీకృష్ణ భార్య కత్తుల సంధ్యకి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వీరిద్దరికి అవుట్‌సోర్సింగ్‌లో ఉద్యోగాలు ఇప్పించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలి



మామిడికుదురులో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణ మాదిగ

మామిడికుదురు: భారత మాజీ ఉప ప్రధాని, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, మహాజన సోషలిస్టు పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. మామిడికుదురు బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ నిలువెత్తు విగ్రహాన్ని ఆయన శనివారం ఆవిష్కరించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముందుగా పాశర్లపూడి వైనతేయ వారధి వద్ద నుంచి ఎమ్మార్పీఎస్ శ్రేణులు భారీ ఊరేగింపుగా కృష్ణమాదిగను మామిడికుదురు సెంటర్‌కు తీసుకువచ్చారు. విగ్రహావిష్కరణ అనంతరం ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి నూటికుర్తి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో కృష్ణమాదిగ మాట్లాడారు. సమావేశంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, బొంతు రాజేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు మంద గాంధీ, చేట్ల సత్యనారాయణ, నేదునూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జేవీకే కిట్ల తనిఖీ

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లను స్టాక్ రూమ్‌లను జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ) పి.రాంబాబు శనివారం పరిశీలించారు. స్టాక్ పాయింట్‌లో ఉన్న షూస్, ఏకరూప దుస్తులు వివరాలను నమోదు చేసుకున్నారు. నాణ్యత లేని దుస్తులను వెనక్కి పంపించి వేయాలని, షూస్ కొలతలు పక్కాగా తీసుకోవాలని సూచించారు. జగనన్న విద్యాకానుక వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. మండలంలోని ఐదేళ్ల దాటిన చిన్నారులు 18,566 ఉన్నారన్నారు. వీరందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సీఆర్‌పీలు యడ్ల అపర్ణ, కుమారి, పి.జ్యోతి, పెద్దిరెడి శ్రీనివాసు, గంటి శ్రీనివాసును ఆదేశించారు. అనంతరం ఎంఈఓ డి.మురళీ సత్యనారాయణ, సీఆర్‌పీలతో కలసి బడిఈడు పిల్లలను ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించవలసిన ఆవశ్యకతను వివరించారు.

‘జగనన్న పాలవెల్లువ’పై గ్రామ కమిటీలకు అవగాహన

కొత్తపేట: గ్రామాల్లో మహిళా పాల ఉత్పత్తిదారులకు ఆదాయం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ‘జగనన్న పాలవెల్లువ’ పథకం అమలు చేస్తుందని ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు తెలిపారు. ఈ పథకంపై శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బిళ్లకుర్రు, అవిడి, మోడేకుర్రు, ఖండ్రిగ గ్రామాల గ్రామ స్థాయి కమిటీ (గ్రామ కార్యదర్శి, వీఆర్వో, వెటర్నరీ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వైఎస్సార్ క్రాంతిపథం సీసీ, యానిమేటర్)లకు ఎంపీడీఓ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వ లక్ష్యాలను ఆయన వివరించారు. ప్రభుత్వం పాలు మార్కెటింగ్ పార్టనర్‌గా అమూల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. గ్రామాల్లో పాల ఉత్పత్తిదారుల నుంచి పాలు సేకరించి వారికి సరైన ధర కల్పించేందుకు, తద్వారా వినియోగదారులకు నాణ్యమైన పాలు అందించడమే ఈ పథకం ముఖ్యోద్దేశమన్నారు. ఇందుకు గ్రామ స్థాయి కమిటీలు ప్రతి గ్రామంలో మహిళా డైరీ సహకార సంఘం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఆ సంఘం ద్వారా పాలు సేకరించి, పాల ఉత్పత్తిదారులకు సరైన ధర కల్పించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంపొందించాలన్నారు. ఇంకా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ ఎస్.ఆనంద్, వైఎస్సార్ కాంత్రి పథం ఏపీఎం జి.విశ్వనాథం, గ్రామ కార్యదర్శులు మంగిపూడి రాంబాబు, సుంకర రెడ్డి నాయుడు, సీహెచ్ శాంతి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో జగనన్న పాలవెల్లువపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ మహేశ్వరరావు

పాలవెల్లువపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఆలమూరు: పాలవెల్లువ కార్యక్రమంపై గ్రామాల్లో విరివిగా పాడి రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ అన్నారు. మండలంలోని సంధిపూడి పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ తోట భవాని అధ్యక్షతన శనివారం పాలవెల్లువ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ జాన్‌లింకన్, ఈఓపీఆర్డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్ విచ్చేసి యానిమేటర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళ శక్తి సంఘాలను చైతన్యవంతం చేసి గ్రామ సచివాలయ సిబ్బంది సాయంతో పాడి రైతులను గుర్తించి ఆ మేరకు ప్రభుత్వానికి పాల విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యదర్శి ఎస్.వీర్రాజు, పశుసంవర్ధక శాఖ అధికారి ఈదల శ్రీనివాసు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థలో వలంటీర్లే కీలకం



ర్యాలిలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థలో వలంటీర్లే కీలకమని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శనివారం ర్యాలి గ్రామంలో 17 గ్రామాలకు సంబంధించి వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర, అవార్డులను అందజేసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం దిశగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన విప్లవాత్మక చర్యల్లో ఏర్పడిన గ్రామ సచివాలయ వ్యవస్థలో వలంటీర్ల వ్యవస్థే కీలకమన్నారు. గ్రామాల్లో వలంటీర్లు ప్రజలకు సేవలందిస్తూ వారి మన్ననలు అందుకున్న వలంటీర్లను సన్మానించడం తన అదృష్టమన్నారు. పేద ప్రజలకు ఎలాంటి సిఫారసు లేకుండా ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి వద్దకు తీసుకువెళ్లి వలంటీర్లు అందిస్తున్నారన్నారు. అర్హత ఉన్న అందరికి కుల, మత, ప్రాంత, వర్గ రాజకీయ పార్టీలు, అసమానతలు చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. తొలుత పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి ఉమా కమండేలేశ్వర స్వామి ఆలయం వద్ద జరుగుతున్న ధ్వజస్తంభ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పెన్మెత్స సత్యనారాయణరాజు, వాడపల్లి దేవస్థానం సభ్యులు మెర్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పెదపళ్లలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వలంటీర్లకు ఘన సత్కారం

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఘన సత్కారం జరిగింది. పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు, సర్పంచ్ యేడిద సత్యశ్రీ, ఎంపీటీసీ నెక్కంటి ప్రమీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, మండల పార్టీ కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. గ్రామ వలంటీర్లందరికి పూలమాల, దుశ్శాలువ కప్పి, ప్రశంసా పత్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి వి.వేణి, మేడపాటి లక్ష్మణరావు, గొడితి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల పరిష్కారానికి ఓఎన్జీసీ సానుకూలం

మలికిపురం: మండలంలోని శంకరగుప్తం, అడవిపాలెం గ్రామాల్లో గతంలో ఓఎన్జీసీ ఇచ్చిన హామీలపై శనివారం సదరు సంస్థ అధికారుల నుంచి ప్రజాప్రతినిధులకు సానుకూల నిర్ణయం వచ్చింది. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనుల అమలుకు ఆందోళనను ప్రజాప్రతినిధులు, ప్రజలు చేపట్టిన సంగతి విదితమే. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సర్పంచ్‌లు రాపాక ఆనంద్ కుమార్, కొల్లు అనంతలక్ష్మి, ఎంపీటీసీలు ఆచంట మాణిక్యం, మానుకొండ ప్రమీల, పలువురు నాయకులు, తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు, ఓఎన్జీసీ ప్రతినిధులు ప్రసాద్ (జీఎం), కిరణ్‌ల డిమాండ్లపై సమావేశం నిర్వహించారు. దీనిపై శంకరగుప్తం నుంచి వంతెన మీదుగా అడవిపాలెం వరకూ రహదారి నిర్మాణంకు రూ.74.90 లక్షల నిధులు మంజూరు చేసినట్టు సర్పంచ్‌లు ఆనంద్‌కుమార్, అనంతలక్ష్మి తెలిపారు. గ్రామంలో ఆర్వో ప్లాంటు, ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ఇతర అంశాలపై సంస్థ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు ఇచ్చారని, వాటికి మంజూరు ఉత్తర్వులు ఇచ్చేలా ఓఎన్జీసీ అధికారులు తమకు హామీ ఇచ్చారని కూడా ప్రజాప్రతినిధులు అన్నారు. జూన్ 3న మరో దఫా అధికారులతో సమావేశం కానున్నట్టు కూడా వారు చెప్పారు. ఎంపీడీవో యు.బాబ్జీరాజు, విద్యుత్ ఏఈ ఎం.సతీష్, నాయకులు చింతా సత్య, నక్కా రమేష్, వీర్రాజు, మల్లికార్జున, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మలికిపురం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో చర్చిస్తున్న ప్రజాప్రతినిధులు

రైతు భరోసాపై ఎమ్మెల్యే సమీక్ష

కొత్తపేట: డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద 2023–24 సంవత్సరం తొలి విడతగా నియోజకవర్గంలో 27,182 మంది రైతులకు రూ.14,95,01,000 లబ్ధి చేకూరినట్టు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. ఈ ఏడాది తొలి విడత రైతు భరోసా పథకంపై వ్యవసాయ శాఖ స్థానిక సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఎం.వెంకటరామారావుతో సమీక్షించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు అర్హులైన రైతులకు, కౌలు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ ఒక్క రైతుకు, ఏప్రాంతానికి అన్యాయం జరిగినా వారిపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలాల వారీగా రైతు భరోసా వివరాలు వివరించారు.

పీఏసీఎస్ డైరెక్టర్‌కు సత్కారం



రామరాజులంకలో రామచంద్రరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: మండలంలోని రామరాజులంక పీఏసీఎస్ సంఘ డైరెక్టర్‌గా ఎన్నికైన వలవల రామచంద్రరావును శనివారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సత్కరించారు. ఈ మేరకు పై సత్కారాన్ని ఆయన సంఘ కార్యాలయంలో చేశారు. త్రిసభ్య కమిటీ చైర్మన్ చొప్పల రాజేశ్వరరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల బ్రహ్మాజీ, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ నల్లి శివకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరుని ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు.

దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

మామిడికుదురు: దళిత సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని దళిత బహుజన మహిళా శక్తి సంఘం జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికా చట్టంపై చేపట్టిన ప్రచారోద్యమం శనివారం మామిడికుదురు చేరింది. స్థానిక బస్టాండ్ కూడలిలో జరిగిన కార్యక్రమంలో రాజామణి మాట్లాడారు. సంఘ ప్రతినిధులు ఉద్యమ గీతాలు ఆలపించారు.

మలికిపురం: షెడ్యూల్డ్ కులాల, తెగల ఉప ప్రణాళికా చట్టం 2013ని సవరణ చేసి శాశ్వత చట్టంగా తీసుకురావాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా దళిత బహుజన మహిళా శక్తి డిమాండ్ చేసింది. శనివారం మలికిపురంలో ఉప ప్రణాళిక చట్టం ప్రచార ఉద్యమంలో భాగంగా మహిళా శక్తి జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి ఆధ్వర్యాన సభ్యులు ర్యాలీ నిర్వహించారు. మహిళా శక్తి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

ఆలమూరు: వైద్యారోగ్యశాఖ సూచనలు, సలహాలకు అనుగుణంగా పౌష్టికాహారాన్ని తీసుకుని ఎల్లప్పుడు బలవర్ధక ఔషధాలు వాడాలని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భవానీశంకర్ కోరారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని ఆలమూరు యానాదులపేటలో శనివారం సూపర్‌వైజర్ పీవీ రమణారావుతో కలసి పర్యటించారు. బాలింతలు, గర్భిణులు (యాంటీనేటర్లు) మెరుగైన ఆరోగ్యానికి తీసుకోవలసిన చర్యలను వివరించారు. గర్భిణులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే సత్వరమే ఆరోగ్య ఆశ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఎంఎల్‌హెచ్‌పీ కె.సుమాంజలి, ఏఎన్ఎం సంధ్యారాణి పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలి

అయినవిల్లి: రైతులకు ధాన్యంపై ప్రభుత్వం గిట్టుబాటు ఇవ్వాలని ఎన్‌జేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు చేపట్టిన పోరుబాట యాత్ర శనివారం అయినవిల్లి మండలం చేరుకుంది. ఇందులో భాగంగా మండలంలోని నేదునూరు గ్రామంల్లో వీరు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఆయన వెంట సలాది శ్రీను, భావన సూరిబాబు, పసుపులేటి సుబ్బారావు, మొగిలి సత్యనారాయణ తదితరులు ఉన్నారు

పిచ్చుకలంక వద్ద స్నానాలు చేస్తే చర్యలు తప్పవు

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ దిగువన గోదావరిలో స్నానాలకు దిగితే చర్యలు తప్పవని ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. శనివారం మండలంలోని పిచ్చుకలంక వద్ద ఇరిగేషన్, గ్రామస్తులు, పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గోదావరిలో స్నానం చేయడం వల్ల పలు చోట్ల గోతులు, ఊబులు ఉన్నాయన్నారు. ఇటీవల పలువురు మృత్యువాత పడ్డారన్నారు. గోదావరిలో పిచ్చుకలంక వద్ద గోదావరిలో స్నానాలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అలాగే పలు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్, పోలీస్, గ్రామస్తులు, పర్యాటకులు పాల్గొన్నారు..